క్లుప్తంగా

సీఎం సహాయనిధితో నిరుపేదలకు లబ్ధి



ఎల్‌వోసీ అందిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాలరూరల్: నిరుపేదలకు సీఎం సహాయనిధితో ఎంతో లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం అనంతారం గ్రామానికి చెందిన తుపాకుల చంద్రవతికి శస్త్ర చికిత్స కోసం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.1.50 లక్షల ఎల్‌వోసీని మంగళవారం వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, చేని సురేందర్, శ్రీపాల్, నాగరాజు,శ్రీకాంత్ పాల్గొన్నారు.

కలిసికట్టుగా పనిచేసి జీవన్‌రెడ్డిని గెలిపించాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి

జగిత్యాల: కార్యకర్తలంతా కలిసికట్టుగా పనిచేసి నిజామాబాద్ ఎంపీగా జీవన్‌రెడ్డిని గెలిపించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. మంగళవారం పట్టణంలోని 47,48 వార్డుల్లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో జీవన్‌రెడ్డిని గెలిపించుకోవాలని, ప్రజల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. జీవన్‌రెడ్డి గళాన్ని పార్లమెంట్‌లో విన్పించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్లు విజయలక్ష్మి, నాగభూషణం నాయకులు పాల్గొన్నారు.

అవినీతి రహిత పాలన బీజేపీతోనే సాధ్యం



ఓట్లు అభ్యర్థిస్తున్న బీజేపీ నాయకులు

కథలాపూర్: అవినీతి రహిత పాలన బీజేపీతోనే సాధ్యమని, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి పట్టం కట్టాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎడ్మల వినోద్‌రెడ్డి అన్నారు. మండలంలోని భూషణరావుపేట, దూలూర్ గ్రామాల్లో కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌కు మద్దతుగా మంగళవారం ఇంటింటా ప్రచారం చేశారు. పేద ప్రజల సంక్షేమం కోరేది బీజేపీ ఒక్కటేనని, ప్రజలకు భద్రత కల్పించి అండగా ఉండే బీజేపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పల్లె గంగాధర్, అంగరి ప్రేమ్‌సాగర్, ప్రవీణ్, మహేశ్‌గౌడ్, నరేందర్ గౌడ్, శ్రీనివాస్, రాజాగౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్త హీనత పరీక్షలు



విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

మల్లాపూర్: ఎనీమియా ముక్త్ భారత్ కోసం కృషి చేయాలని ఆర్‌బీఎస్‌కే వైద్యురాలు డాక్టర్ మౌనిక అన్నారు. మండల కేంద్రంలోని ఎస్టీ మినీగురుకుల బాలికల పాఠశాలలో రాష్ట్రీయ బాల స్వస్తీయా కార్యక్రమం అమలులో భాగంగా మంగళవారం తెలంగాణ హెల్త్ అండ్ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పాఠశాలలోని 6 నుంచి 14 ఏళ్ల లోపు 135 మంది విద్యార్థులకు రక్తపరీక్షలు నిర్వహించామని తెలిపారు. చూపు సరిగాలేని విద్యార్థినిలను గుర్తించి నమోదు చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీప్రియాంక, ఏఎన్‌ఎం సోని, అరుణ, ఆర్‌బీఎస్‌కే ఫార్మాసిస్టు మాధవి, ఎఎన్‌ఎం సరిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం

జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన సామూహిక హనుమాన్ చాలీసా పారాయణంలో మంగళవారం భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై ప్రతిష్ఠించి అభిషేకం జరిపించారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పబ్లిక్ టాయిలెట్లపై పట్టింపేది?



ఇది ఆర్టీసీ బస్‌స్టేషన్ ఔట్ గేట్ పక్కన ఉన్న పబ్లిక్ టాయిలెట్. ప్రజల కోసం ఏర్పాటు చేసిన దీనిలో స్థానిక వ్యాపారులు తమ సామగ్రిని నిల్వ చేసుకుంటున్నారు. ఇందుకు సంబంధిత కాంట్రాక్టర్ వారి నుంచి నెలకు కొంత రుసుము తీసుకుంటున్నట్లు తెలిసింది.



పట్టణంలోని కూబ్‌సింగ్ కుంట పార్కుకు వచ్చే ప్రజల కోసం ఏర్పాటు చేసిన పబ్లిక్ టాయిలెట్ ఇది. కొన్ని రోజులు పనిచేసిన తర్వాత నిర్వాహణ లేక మూతబడింది. దీంతో పార్కు వద్దకు ప్రజలు ఒంటికి, రెంటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలోని మండల పరిషత్ స్థలంలో ఉన్న పబ్లిక్ టాయిలెట్ ఇది. జన సంచారం లేని ప్రదేశంలో దీనిని ఏర్పాటు చేయడంతో అటు వైపు ఎవరు వెళ్లడం లేదు. దీంతో ప్రారంభం నుంచి నిరుపయోగంగానే ఉంది.

- నిర్వాహణ లేక నిరుపయోగంగా మారిన వైనం
- సమస్య పరిష్కారంపై అధికారుల నిర్లక్ష్యం
- ప్రజలకు తప్పని ఇబ్బందులు

మెట్‌పల్లి: పట్టణంలో పబ్లిక్ టాయిలెట్ల నిర్వాహణ అధ్వానంగా తయారైంది. జన సంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రజలు ఒంటికి, రెంటికి ఇబ్బందులు పడవద్దనే వీటిని ఏర్పాటు చేశారు. కానీ నిర్వాహణ సక్రమంగా లేక చాలా చోట్ల నిరుపయోగంగా మారాయి. అయినా అధికారులు సమస్య పరిష్కారంపై దృష్టి సారించకపోవడం వల్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఐదు చోట్ల ఏర్పాటు

- పట్టణంలో పార్కు, కొత్త బస్టాండ్, మండల పరిషత్, రెడ్ క్రాస్ భవనం, మున్సిపల్ కార్యాలయ ఆవరణ తదితర చోట్ల ఐదు పబ్లిక్ టాయిలెట్లను ఏర్పాటు చేశారు
- కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్ నిధులతో వీటిని నిర్మించారు. ఒక్కో దానికి రూ.5 లక్షల చొప్పున వెచ్చించినట్లు అధికారులు పేర్కొన్నారు.
- వీటి నిర్వాహణను మున్సిపల్ అధికారులు ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించారు.
- కానీ సదరు కాంట్రాక్టర్‌కు ఏడాది కాలంగా బిల్లులు చెల్లించకపోవడం వల్ల నిర్వాహణ విషయంలో అతడు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాడు.
- వాస్తవానికి మున్సిపాలిటీకి వచ్చే పట్టణ ప్రగతి నిధుల నుంచి ఈ బిల్లులు చెల్లించడం జరుగుతోంది. కొంతకాలంగా ఆ నిధులు ఆశించిన స్థాయిలో రాకపోవడం వల్ల అధికారులు బిల్లులు చెల్లించలేకపోతున్నారని తెలిసింది.

ప్రజలకు తప్పని ఇబ్బందులు

- ఒక్క మండల పరిషత్‌లో తప్ప మిగతా నాలుగింటిని జన సంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లోనే ఏర్పాటు చేశారు.
- ప్రారంభంలో ఉపయోగపడ్డ ఇవి ఆ తర్వాత నిర్వాహణ లేకపోవడం వల్ల మూతబడ్డాయి.
- ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో అవి అందుబాటులో లేకపోవడం వల్ల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.
- అధికారులు దీనిని దృష్టిలో పెట్టుకొని వాటిని వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కరిస్తాం

పబ్లిక్ టాయిలెట్ల నిర్వాహణపై ఫిర్యాదులు వస్తున్నాయి. నిధుల కొరతతో కాంట్రాక్టర్‌కు బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతోంది. ఈ కారణంగా కాంట్రాక్టర్‌కు నిర్వాహణ భారంగా మారింది. తొందరలోనే సమస్యను పరిష్కరించి వినియోగంలోకి తెచ్చేలా చూస్తాం.

– రత్నాకర్, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్

మత్తు పదార్థాలపై యువత అప్రమత్తంగా ఉండాలి

జగిత్యాల: మత్తు పదార్థాలపై యువత అప్రమత్తంగా ఉండాలని మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ అన్నారు. మంగళవారం కళాశాలలో హెల్త్‌క్లబ్, ఎన్‌ఎస్‌ఎస్, జువాలజీ విభాగాల ఆధ్వర్యంలో డ్రగ్ అడిక్షన్ అవైర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. యువత ఆకర్షితులవుతున్న తీరు వారిని సాధారణ జీవితంలోకి తీసుకువచ్చేందుకు తల్లిదండ్రులు ఎంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. మెడికల్ కళాశాల మానసిక విభాగాధిపతి విశాల్ మాట్లాడుతూ నేటి యువతరం మాదక ద్రవ్యాలతో తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, వారికి ఈ అంశాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు సాకేత్‌రెడ్డి, ఆశా మౌనిక, వైస్ ప్రిన్సిపల్ సుల్తానా, కో–ఆర్డినేటర్ జ్యోత్‌కౌర్, జ్యోతిలక్ష్మి, సత్యప్రకాశ్, కిరణ్మయి, చంద్రయ్య, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సత్యనారాయణ



ఎమ్మెల్సీలు మహేశ్‌కుమార్, జీవన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న వివిధ పార్టీల నాయకులు

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

మెట్‌పల్లి/కోరుట్ల: అసెంబ్లీ ఎన్నికల్లో కోరుట్ల నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన చెన్నమనేని శ్రీనివాస్‌రావు మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అలాగే నియోజకవర్గంలోని బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు గాంధీభవన్‌లో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జేఎన్.వెంకట్, మాజీ జెడ్పీటీసీలు ఆకుల లింగారెడ్డి, జేఎన్.సునీత, కొక్కు పురుషోత్తం, మాజీ ఎంపీపీ నేరేళ్ల దేవేందర్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ సమక్షంలో చేరగా.. కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, కల్వకుంట్ల సుజీత్‌రావు, జువ్వాడి కృష్ణారావు, కొమొరెడ్డి కరం తదితరులు పాల్గొన్నారు.

నివేదిక రాగానే షుగర్ ఫ్యాక్టరీ ప్రారంభం

మల్లాపూర్: మూతపడిన నిజాం షుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణకు ప్రభుత్వం కమిటీ వేసిందని, నివేదిక రాగానే చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని చెరుకు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మామిడి నారాయణరెడ్డి అన్నారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణ కమిటీ సభ్యుడు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి సీఎంను మంగళవారం హైదరాబాద్‌లో కలిశారు. ఫ్యాక్టరీల పునరుద్ధరణకు ఆర్థిక వనరులు సమకూర్చడం, భూములు విక్రయించకుండానే బకాయిల చెల్లింపు, ప్రభుత్వపరంగానే ఫ్యాక్టరీ నిర్వహణపై కమిటీ నివేదిక సమర్పించిన వెంటనే చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారని తెలిపారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి

ఇబ్రహీంపట్నం: రైతులకు ఫర్టిలైజర్ దుకాణాల యాజమానులు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను విక్రయించాలని సహాయ వ్యవసాయ సంచాలకులు లావణ్య అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని రైతు వేదిక భవనంలో మండలంలోని ఫర్టిలైజర్ దుకాణం యాజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లడుతు లైసెన్స్ లేకుండ ఎరువులను, విత్తనాలను అమ్మితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటానని, ప్రతి డీలర్ నాణ్యమైన విత్తనాలను, ఎరువులను అమ్మాలని, రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ఏవో దీపిక, ఏఈవోలు, ఫర్టిలైజర్ డీలర్లు పాల్గొన్నారు.

మల్యాల: రైతులు సేంద్రియ ఎరువులు వినియోగించాలని, పంట దిగుబడి పెరగడంతో పాటు భూసారం నాణ్యత పెరుగుతుందనే శాస్త్రవేత్తల సూచనలు రైతులు పాటించాలని మల్యాల మండల వ్యవసాయాధికారి కె.చంద్రదీపక్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్‌లు శాస్త్రవేత్తలు రైతులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

సారంగాపూర్: రైతులకు నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలని బీర్‌పూర్ మండల వ్యవసాయాధికారి అనూష అన్నారు. మంగళవారం బీర్‌పూర్ మండలంలోని విత్తన, ఎరువుల డీలర్లతో బీర్‌పూర్ రైతువేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రైతులకు తప్పనిసరిగా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్న కంపెనీ విత్తనాలు, ప్రభుత్వం సర్టిఫైడ్ చేసిన వాటినే విక్రయించాలని, విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలన్నారు. స్టాక్ రిజిష్టర్లు, వాటి ధరలను, లైసెన్స్‌ల వివరాలను తెలిపే విధంగా సమాచారం అందుబాటులో ఉంచాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు సందీప్, మాధవ్, డీలర్లు ఉన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడి

గొల్లపల్లి: రైతులు సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వరంగల్ డా.ఉమారెడ్డి అన్నారు. మంగళవారం గొల్లపల్లి మండల కేంద్రంలో సేంద్రియ వ్యవసాయంపై రైతునేస్తం ప్రత్యక్ష ప్రసారం ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో కరుణ, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాటాడుతున్న ఏడీఏ లావణ్య

రైతులు పచ్చి రొట్ట ఎరువులను వాడాలి

ఇబ్రహీంపట్నం: రైతులు తమ వ్యవసాయ భూముల్లో పచ్చిరొట్ట ఎరువులను వాడితే అధిక దిగుబడి వస్తుందని శాస్త్రవేత్త డాక్టర్ ఉమారెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని మంగళవారం రైతువేదికలో వ్యవసాయ శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా సూచనలను, సలహాలను ఇచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏడీఏ లావణ్య, మండల వ్యవసాయ అధికారి దీపిక, ఏఈవోలు నరేశ్, శ్యామ్‌కుమార్, రవళిక, హరీశ్, రైతులు పాల్గొన్నారు.

'అనన్య'కు సన్మానం



అనన్యను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

జగిత్యాలజోన్: న్యాయశాస్త్రంలో 8 బంగారు పతకాలు సాధించిన కూర్మచలం అనన్యను జగిత్యాల బార్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం ఘనంగా సన్మానించారు. జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన అనన్య ఉస్మానియా యూనివర్శిటీ పరిధిలోని ఆంధ్ర మహిళా లా కళాశాలలో చదివి 8 బంగారు పతకాలు సాధించింది. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డబ్బు లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, అనన్య తల్లితండ్రులు పుష్పలత– వేణుమాధవ్, భర్త అజయ్ రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

గొడుగులు పంపిణీ

జగిత్యాలటౌన్: శ్రీసత్యసాయి బాబా ఆరాధనా మహోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం జిల్లా కేంద్రంలోని వీధి వ్యాపారులకు సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో గొడుగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యాసాయి సేవాసమితి కన్వీనర్ బట్టు రాజేందర్ మాట్లాడుతూ వీధుల్లో చిరువ్యాపారులకు ఎండా,వానకు రక్షణ కల్పించేలా చిన్నా,పెద్ద గొడుగులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో దశరథరెడ్డి, ఊటూరి శివకుమార్, సునీల్, నరేందర్‌రాజు, మహిళలు పాల్గొన్నారు.

యువకుల రక్తదానం

కథలాపూర్: మండలంలోని పెగ్గెర్ల, భూషణరావుపేట గ్రామానికి చెందిన ఐదుగురు యువకులు మంగళవారం రక్తదానం చేసి తమ ఉదారతను చాటుకున్నారు. కోరుట్ల మండలం నాగులపేట గ్రామానికి చెందిన మహిళకు గుండె ఆపరేషన్ కోసం రక్తం అవసరం కాగా, ఈ విషయం తెలుసుకున్న పెగ్గెర్ల గ్రామానికి చెందిన ఎం ప్రణీత్, సీహెచ్ శ్రీకాంత్, భూషణరావుపేటకు చెందిన ఎస్.అరుణ్, ఎం.వినోద్, పి.గంగాధర్ కరీంనగర్ వెళ్లి రక్తదానం చేశారు. రక్తదానం చేసిన యువకులను పలువురు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరానిలిపివేత

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం ధరూర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల దృష్ట్యా ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ దొంతి శ్రీధర్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు సీతారాముల కల్యాణం

రాయికల్: మండలంలోని అల్లీపూర్, అయోధ్య, కుమ్మరిపల్లి, తాట్లవాయి, కొత్తపేట తదితర గ్రామాల్లో బుధవారం శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణ మహోత్సవం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మల్లాపూర్: మండలంలోని మొగిలిపేట గ్రామానికి చెందిన మామిడి నర్సయ్య(34) అనే వ్యక్తి మద్యానికి బానిసై ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన మామిడి నర్సయ్య కొంత కాలంగా మద్యానికి బానిసై జీవితంపై విరక్తితో సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య,ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నాడు. మృతుడి భార్య వనిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఇస్లాంపురలో ఎండీ.ముఖీం ఇంట్లో సోమవారం రాత్రి 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు పట్టణ ఎస్సై మన్మథరావు తెలిపారు. రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పోచమ్మవాడలో..

జిల్లా కేంద్రంలోని పోచమ్మవాడలో పుల్ల రాజమల్లయ్య అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిలువ ఉన్న 5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు పట్టణ ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అమ్మ ఆదర్శ కమిటీలు విధివిధానాలు పాటించాలి

జగిత్యాల: అమ్మ ఆదర్శ కమిటీలు విధివిధానాలు పాటించాలని మండల ప్రత్యేక అధికారి బోనగిరి నరేశ్ అన్నారు. కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమయ్యారు. ఆదర్శ కమిటీల బాధ్యతలు, వారు చేపట్టాల్సిన పనులు వివరించారు. హెచ్‌ఎంలు, కమిటీ చైర్మన్, సభ్యుల సహకారంతో సజావుగా నిర్వహణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అనిల్‌బాబు, అర్బన్ ప్రత్యేకాధికారి రాజ్‌కుమార్, మెప్మా ఏవో శ్రీనివాస్‌గౌడ్, ఏఈవోలు, ఎంపీవోలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ విధివిధానాలపై మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జెడ్పీ సీఈవో, మండల ప్రత్యేకాధికారి రఘువరన్ హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల బాధ్యతలు చేపట్టవల్సిన పనులను వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో రాజేందర్ రెడ్డి, ఇన్‌చార్జి ఎంఈవో ఆనందరావు, ఏపీఎం శంకర్, పీఆర్ఏఈ అరుణ, హెచ్‌ఎంలు, సీసీలు, వీవో అధ్యక్షులు పాల్గొన్నారు.

మల్లాపూర్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసమే ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేసిందని ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, పాఠశాలల హెచ్‌ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అమ్మ ఆదర్శ కమిటీల విధి విధానాలను వివరించారు. సమావేశంలో ఎంపీవో జగదీశ్ హెచ్‌ఎంలు, వీవోఏలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో రఘువరన్

రాయికల్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని ఎంపీడీవో చిరంజీవి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, ఎంఈవో గంగాధర్, ఏపీఎం చక్రవర్తి, ఎంపీవో సుష్మ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న అగ్ని మాపక వారోత్సవాలు



అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ధర్మపురి: పట్టణంలో అగ్నిమాపక వారోత్సవాలు మంగళవారం రెండో రోజుకు చేరాయి. వారోత్సవాల్లో భాగంగా ధర్మపురి పట్టణంలోని నీళ్ల ట్యాంకు వద్ద సిలిండర్ లీకేజీ ద్వారా, గ్యాస్ లీకేజీలతో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు నివారణ చర్యలపై మహిళలకు అవగాహన కల్పించారు. మంటల్ని ఎలా ఆర్పాలో చేసి చూపించారు. కార్యక్రమంలో ఎల్ఎఫ్ లక్ష్మీ నారాయణ, ప్రవీణ్‌రావ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాప్ నిర్వాహకుల బైండోవర్

జగిత్యాలక్రైం: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా కేంద్రంలో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను మంగళవారం అర్బన్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు పట్టణ ఎస్సై మన్మథరావు తెలిపారు.

విశ్రాంత ఉద్యోగి ఔదార్యం

ధర్మపురి: ఉన్నత చదువులో రాణిస్తూ ఎంబీబీఎస్ చదువుతున్న ఓ నిరుపేద విద్యార్థినికి హాస్టల్ ఖర్చులు, పుస్తకాల కోసం జగిత్యాలకు చెందిన విశ్రాంత ఉద్యోగి రూ.1.20లక్షలు సాయం అందించి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. 108 అంబులెన్స్ కాంట్రాక్టు డ్రైవర్‌గా జగిత్యాలలో పని చేస్తున్న గంగాధర మండల కేంద్రానికి చెందిన గంగాధర శ్రీనివాస్‌కు ముగ్గురు కూతుళ్లు. ఆర్థిక ఇబ్బందులున్నా.. కూతుళ్లను చదివిస్తున్నాడు. పెద్ద కూతురు సాయి నిఖిత హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు మెడికల్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఎంబీబీఎస్‌లో మంచి ర్యాంకు సాధించడంతో కళాశాల సీటు ఇచ్చినా హాస్టల్ ఫీజు, పుస్తకాలకు ఏడాదికి రూ.1.20లక్షలు చెల్లించాల్సి వస్తోంది. ఆ మొత్తం కూడా శ్రీనివాస్ వద్ద లేవు. ఆయన కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న ధర్మపురికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేశ్ జగిత్యాలలో ఉంటున్న విశ్రాంత ఉద్యోగి ఎన్నాకుల రాజేశంను సంప్రదించి సాయం అందించాలని కోరారు. స్పందించిన రాజేశం తన తల్లిదండ్రులు ఎన్నాకుల రాజమ్మ, లక్ష్మీనారాయణ జ్ఞాపకార్థంతో రూ.1.20 లక్షలు సాయం అందించారు. రమేశ్‌కు శ్రీనివాస్ కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.

శ్రీరాముని కల్యాణానికి ఆలయాలు ముస్తాబు

సారంగాపూర్: సీతారాముల కల్యాణానికి సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని పలు గ్రామాల్లోని ఆలయాలు ముస్తాబయ్యాయి. సారంగాపూర్, కొల్వాయిలోని శ్రీరామాలయాలు, దుబ్బరాజన్న ఆలయ అనుబంధ శ్రీరామాలయంతో పాటు, ఆయా గ్రామాల్లోని ఆలయాలను ముస్తాబు చేశారు. మంగళవారం అంజన్న స్వాములు, గ్రామస్తులు స్వామివారి ఉత్సవమూర్తులతో శోభాయాత్ర నిర్వహించారు.



ఘనంగా స్కూల్ డే

గొల్లపల్లి: మండలంలోని చిల్వకోడూర్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం స్కూల్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మమత మాట్లాడుతూ ప్రీస్కూల్ విద్యతో చిన్నారుల్లో సృజాతన్మకత శక్తి పెంపొందుతుందన్నారు. మూడు నుంచి ఆరేళ్ల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని, వారికి ఆటపాటలతో విద్యనందిస్తామన్నారు. కార్యక్రమంలో డిస్టిక్ మిషన్ కోఆర్డినేటర్ అశ్విని, లిట్రసి హేమ, జెండర్ స్పెషలిస్టు గౌతమి, అంగన్‌వాడీ టీచర్లు, ఐకేపీ సీఏలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

'మాదిగలను మోసం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి'

జగిత్యాలటౌన్: జెడ్పీటీసీ మొదలు సీఎం అయ్యేదాకా రేవంత్‌రెడ్డికి అండగా నిలిచిన మాదిగలను ఇప్పుడు మోసం చేస్తున్నారని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు దుమాల గంగారాం అన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం మాట్లాడారు. నారాయణఖేడ్ జనజాతరలో రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలు మాట్లాడారని, వాటిని ఖండించారు. మంద కృష్ణ నిర్వహించిన ప్రతి బహిరంగసభకు రేవంత్‌రెడ్డిని ఆహ్వానించి మాట్లాడించారని, అందుకే ఆయనకు గుర్తింపు వచ్చిందని, ఇప్పుడు ఆ విషయాన్ని మర్చిపోయిన రేవంత్‌రెడ్డి మందకృష్ణనే విమర్శిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేతో కలిసి రేవంత్ మాదిగలను అణిచి వేస్తున్నారని, పైకిమాత్రం ప్రేమ ఉన్నట్లు మొసలి కన్నీరు కారుస్తున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో రేవంత్‌కు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చెట్‌పల్లి లక్ష్మణ్, ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు బోనగిరి కిషన్, నాయకులు చిర్ర లక్ష్మణ్, శేఖర్ పాల్గొన్నారు.